

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | బుధవారం | నవంబర్ 08, 2023 | www.navatelangana.com



కలప దొంగ అన్న నోటితో మహాత్మా అని పిలుస్తారా?

- గిరిజన, ముస్లిములకు రిజర్వేషన్లు ఎందుకు పెంచలేదు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్‌పీ

8లో...



పండుగపూట పస్తులేనా..?

- 3 నెలలుగా అందని పెండింగ్ వేతనాలు
- ఇబ్బందుల్లో మిషన్ భగీరథ కార్మిక కుటుంబాలు
- పట్టించుకోని అధికారులు


6లో...

జనహోరు.. గులాబీ జోరు..!

- సీఎం పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధికారంలోకి రాగానే కార్మికులకు పెర్క్ ట్యాక్స్ మినహాయింపు
- సూట్‌కేసులతో వచ్చేవారిని నమ్మకూడదని హితవు
- నా ఇంటి బిడ్డ బాల్క సుమన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి
- ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన జనాలు

వివరాలు 2లో...

నవతెలంగాణ- హాజీపూర్, మందమర్రి



అధికారంలోకి రావడానికి చేసిన అభివృద్ధి సహకరిస్తుంది

- బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి

నవతెలంగాణ–ఆసిఫాబాద్

రానున్న ఎన్నికల్లో తిరిగి తమ అధికారంలోకి రావడానికి 9 సంవత్సరాల్లో తాము చేసిన అభివృద్ధి సహకరిస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. బీజేపీ కాంగ్రెస్‌కు చెందిన రహపెల్లి గ్రామస్తులతో పాటు రెబ్బెన మండలం బీజేపీ సీనియర్ నాయకుడు దాసరి మల్లయ్య, కాంగ్రెస్ నాయకుడు బోర్కొట్టే నానాజీలు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 సంవత్సరాల్లో 70 సంవత్సరాల అభివృద్ధి చేశామన్నారు. ఈ అభివృద్ధి అధికారంలోకి తీసుకువస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. మతతత్వ బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ గురించి ప్రజలు ఎక్కడ కూడా ఆలోచించడం లేదన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిట్ట సంజీవ్, ఇడిదినేని జనార్దన్, సుంకరి శ్రవణ్, ఎలగల సాయి, ఇడిదినేని విజయ్, పెదపల్లి తిరుపతి, పెదపల్లి తిరుమలు పాల్గొన్నారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం నవంబర్ 08, 2023

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయరాలు మాధురి అన్నారు. మంగళవారం మండలంలోని మలక్ చించొలి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను చూపుతూ, చేతి గుర్తుపై ఓటువేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ హరిరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ బొల్లోజు నర్సయ్య, సురేందర్, ఎంపీటీసీ వెంకటరమణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రొడ్డ సునీత మారుతీ, నాయకులు మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, దాసరి రమేష్, సలీమ్, నవీన్, రాజారెడ్డి, మహేష్, మహేందర్, గుర్రాల రాజు, సల్మాన్, రమణ, మల్లయ్య పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో భారీగా గంజాయి మొక్కలను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ ఎక్సైజ్ శాఖ సీఐ సంపత్ కృష్ణా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పచెల్మ గ్రామ శివారులోని పత్తి చేనులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న రాజేష్, పంట చేనులో 115 గంజాయి మొక్కలు గుర్తించి, సీజ్ చేశాము. ఈ 115 గంజాయి మొక్కల విలువ రూ.11లక్షలు ఉంటుంది. ఈ దాడిలో నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై రమేష్, డీటీఎఫ్ నిర్మల్ సీఐ రంగస్వామి, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదిలాబాద్ సీఐ రాకేష్, స్థానిక ఎస్సై కృష్ణాసాగర్, పోలీసులు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీ, సంబంధిత అధికారులతో ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈనెల 30న శాసనసభ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఆదిలాబాద్, బోథ్ శాసనసభ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారంలో భాగంగా ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, ప్రకటనల కొరకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి త్వరగా అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్, పరిశీలన, అకౌంటింగ్ బృందాలను నియమించి ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ వీడియో రికార్డ్ చేయడం జరుగుతుందని తెలిపారు. సి-విజిల్, కంట్రోల్ రూమ్, సువిధ యాప్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఓటర్ స్లిప్పులు, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేపట్టే ప్రచార కార్యక్రమాలలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారుల సమన్వయంతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, రిటర్నింగ్ అధికారి స్రవంతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి కిడ్డి బ్యాంక్ అందజేసిన చిన్నారులు

నవతెలంగాణ-నిర్మల్

మంత్రి ఐకే రెడ్డికి ప్రచారం కోసం చిన్నారులు తమ వద్ద కిడ్డి బ్యాంక్ డబ్బులను అందించారు. మంగళవారం ప్రచారంలో భాగంగా నిర్మల్ మండలం శాకెర గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిన్నారులు హరిణి, చైత్రలు మంత్రికి ఎన్నికల ప్రచారం కోసం తమ కిడ్డి బ్యాంకులను అందజేశారు. దీంతో మంత్రి వారిని ఆప్యాయతగా దగ్గరికి తీసుకున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులను కోరారు.

IN THE COURT OF THE HON'BLE
SENIOR CIVIL JUDGE:: AT ADILABAD
Succession O.P.No. 3 of 2023.
Between:-
Leeladevi Sarada & others
...Petitioners
AND
State Bank of India & another
...Respondents
To,
To whom so ever it may concerned.
(Respondent No.2)
Take notice, that the petitioner herein filed the above S.O.P. before this Court to grant Succession certificate of late Rambilas Sarada, and the above case is posted on 10.11.2023 for appearance of the Respondent No.2 and any body who has got any claim, objection for granting of the Succession Certificate of late Rambilas Sarada in favour of the petitioners they are at liberty to appear before this court on 10.11.2023 at 10.30 a.m. in person or through Advocate duly authorized and file objection if any, failing which the said matter will be heard and determined ex-parte.
// BY ORDER OF THE COURT //
MOHAMMED GHOUSE & SHAIK MANSHEER Advocate
H.No.4-3-74/62/D,
Dwarakanagar, Adilabad

IN THE COURT OF THE HON'BLE
JUNIOR CIVIL JUDGE:: AT ADILABAD
OS.No. 189 of 2023.
Between:-
Mohammad Hussain Khan
...Plaintiff
AND
Whom so ever it may concerned er
. Defendant
To,
To whom so ever it may concerned.
Take notice, that the plaintiff herein filed the above Suit before this Court to Declare the Plaintiff Mohmmad Hussain Khan S/o. Late Mohammed Yousuf Khan, Age: 75 years Senior Citizen, R/o. H.No.10-2-290/54-A, as the legal heir of Shaik Tajunnisa @ Tajunnisa and the above case is posted on 11.1.2024 for appearance of the Respondent and if anybody has got any claim, objection for declaring the plaintiff as legal heirs of Deceased Shaik Tajunnisa @ Tajunnisa they are at liberty to appear before this court on 11.01.2024 at 10.30 a.m. in person or through Advocate duly authorized and file objection of any, failing which the said matter will be heard and determined ex-parte.
// BY ORDER OF THE COURT //
MOHAMMED GHOUSE &
SHAIK MANSHEER
Advocate
H.No.4-3-74/62/D,
Dwarakanagar, Adilabad

జన హోరు..గులాబీ జోరు..!

నవతెలంగాణ- హాజీపూర్, మందమర్రి

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన మంగళవారం మందమర్రి పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటలకు సభాస్థలికి చేరుకున్న ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తొలుత ఈ ప్రాంత చైతన్యం, చరిత్రపై వివరించడంతో పాటు ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. ఎన్నికలు రాగానే ఆగమాగం కావద్దని..ఆయా రాజకీయ పార్టీల చరిత్ర, వాటి నడవడిక, వ్యక్తుల గుణగణాలను తదితర అన్నింటినీ బేరీజు వేసి ఓటు వేయాలని జనాలకు సూచించారు. సభలో ఎక్కువ సమయం ఆ పార్టీకి ప్రత్యర్థులుగా భావిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులపైనే విమర్శలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి పరిస్థితి.. బీఆర్ఎస్ పాలనలో ఈ సంస్థ చెందిన అభివృద్ధిని వల్లెవేశారు. మరోపక్క దేశంలో ఎక్కడాలేని విధంగా సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు ఆయన ఎత్తైన విగ్రహం ఆవిష్కరించినట్లు వివరించి దళితులు,నిమ్నవర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

సూట్‌కేసులతో వచ్చే వారిని నమ్మకూడదు...

ఎన్నికలు రాగానే పార్టీలు మారుస్తూ..టికెట్లు తెచ్చుకొని సూట్‌కేసులతో వచ్చే నాయకులను నమ్మకూడదని పరోక్షంగా కాంగ్రెస్ అభ్యర్థులను విమర్శించారు. వారితండ్రి హయాం నుంచి చెన్నూర్‌ను పాలించిన నాయకులు చేసిన అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ చేసిన అభివృద్ధి కండ్లకు కనిపిస్తుందని గుర్తుచేశారు. రూ.వేల కోట్ల నిధులు మంజూరుచేయించి అభివృద్ధి చేశారని తెలిపారు. సూట్‌కేసులు, నోట్లకట్టలతో వచ్చే వారిని నమ్ముతారా..జేబులో పైసలు లేని..నిఖార్సైన ఉద్యమకారుడు సుమన్‌ను నమ్ముతారా అని జనాలను అడిగారు. మంచిర్యాలలోనూ ఓ అభ్యర్థి పేకాట క్లబ్బులు పెట్టి రూ.వేలకోట్లు సంపాదించి డబ్బులతో జనాలు ఏ మార్చేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రైతుల బాగు కోసం కాంగ్రెస్‌ఏ మాత్రం ఆలోచించడం లేదని..ధరణి తీసేస్తే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ఆగిపోతాయని రైతుల వ్యతిరేకిగా మారిన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకుండా చేయాలని ప్రజలకు సూచించారు.

బాల్క సుమన్ నాబిడ్డలాంటివారు..

తెలంగాణ ఉద్యమకారుడు, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నా బిడ్డలాంటి వారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కువ సమయం నా ఇంట్లోనే ఉంటారని అటు పార్టీకి..ఇటు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారని ప్రశంసించారు. ఒకసారి ఎంపీగా..మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారని రూ.వేలకోట్లతో చెన్నూర్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఎక్కువ సమయం నాతో సన్నిహితంగా ఉండే సుమన్‌ను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. 50 నుంచి 60వేల మెజార్టీతో గెలిపిస్తే మందమర్రిలో డిగ్రీ కళాశాల మంజూరుచేస్తామని హామీనిచ్చారు.

అభివృద్ధి చేసినందుకు నన్ను జైల్లో పెడుతారా

-బాల్క సుమన్, చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి



తెలంగాణ రాష్ట్రసాధన కోసం అలుపెరగని ఉద్యమం చేశానని..రూ.వేల కోట్లు తెచ్చి చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని.. అభివృద్ధి చేసిన నన్ను కాంగ్రెస్ నాయకులు జైల్లో పెడతామని చెబుతున్నారని బాల్క సుమన్‌అన్నారు. చెన్నూర్‌లో ఇప్పటికే 50పడకల ఆస్పత్రిని నిర్మించామని మరో 100పడకలు చేసేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ హత్యారాజకీయాలకు పాల్పడుతోందని..తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ చేతిలో ఉంటే ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ వస్తే తెలంగాణ రాష్ట్రం కుక్కలు చింపిన విస్తారాకు అవుతుందని తెలిపారు. సులువుగా పార్టీలు మార్చే వివేక్ రూ.వందలకోట్లు పెట్టి నాయకులను కొంటున్నారని ధ్వజమెత్తారు. వరదలు, కరోనా సమయంలో కనిపించని అన్నదమ్ములు ఎన్నికలు రాగానే ప్రత్యక్షమవుతారని విమర్శించారు. అనంతరం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులను వివరించారు. మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు.

భారీగా తరలివచ్చిన జనం..

ప్రజా ఆశ్వీరాద సభకు చెన్నూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల ద్వారా వేలాది సంఖ్యలో సభా మైదానానికి వరుసకట్టారు. సభా ప్రాంగణానికి సుమారు రెండు కిలో మీటర్లదూరంలో ఎక్కడ చూసినా ప్రజలే కనిపించారు. గులాబీ జెండాలు ధరించి తెలంగాణ సభస్థలికి వెళ్లడంతో మందమర్రి పట్టణం గులాబీమయంగా మారింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో కేరింతలు కొడుతూ ఉత్సాహం కనబర్చారు. సభా ఏర్పాటుచేసిన సింగరేణి పాఠశాల మైదానం పూర్తిగా నిండిపోవడంతో పాటు వేలాది మంది జనం రోడ్లపై నిలబడి స్కీన్‌ల ద్వారా సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, దండెవిఠల్, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ ఛైర్మెన్ పుస్కూరి రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్,టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణతో పాటు మానసికోల్లాసం



నవతెలంగాణ-నస్పూర్

బాక్సింగ్ క్రీడ ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని మంచిర్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం రవీందర్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా స్థాయి సీనియర్ బాక్సింగ్ పోటీలు నస్పూర్‌లోని సీసీసీలో కుమార్ గన్నర్స్ అకాడమీలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో బాక్సింగ్ క్రీడా అనేది రోజు రోజుకు క్రీడాకారులకు ఆసక్తి చూపుతున్న క్రీడ అని అన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకొని ఎందరో క్రీడాకారులు రాష్ట్ర జాతీయస్థాయిలో రాణించారని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ అవకాశం కూడా లభించిందని తెలిపారు. ఈ పోటీలలో పదిమంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రెసిడెంట్ రవీందర్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టే దేవేందర్, వైస్ ప్రెసిడెంట్ రేవెల్లి మహేష్, జాయింట్ సెక్రటరీ రాజేష్, కుమార్ గన్నర్ అకాడమీ ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి



నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, ఎండీ వాజీద్ ఖాన్, భూషణం, రఫిక్, సాయికుమార్, చరణ్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్



నవతెలంగాణ-కడెం

మండలంలోని చిట్యాల గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన 6గ్యారంటీలను ప్రజలకు వివరించారు. మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గ్రామంలో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భూషణ్, ఇస్రు, పటేల్, వెంకటేష్, శంకర్, నర్సయ్య, సత్తన్న, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కడెం

మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో ఇటీవల కుమురంభీం వర్ధంతి వేడుకల్లో విద్యుద్ఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సౌధాని వెంకటరమణ యాదవ్ మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు నగదు ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే సంఘటనలో విద్యుద్ఘాతానికి గురై నిర్మల్ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వెళ్లి బాధితున్ని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ దేవేందర్‌రెడ్డిని కోరారు. వారి వెంట తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు రవి, అజ్మీర రాజేష్ నాయక్, తిరుపతి నాయక్, వెడ్మా దేవేందర్, అర్క శ్రీనివాస్, ఆనంద్, లింభారావు, మొగిలి, ప్రవీణ్ ఉన్నారు.

జైజవాన్ జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-కడెం

మండలంలోని పాండ్వాపూర్ (తండ) గ్రామానికి చెందిన అజ్మీరా నరేష్(30) మెదడులో రక్తం గడ్డ కట్టడంతో గత నెలలో మరణించారు. నరేష్ వాళ్లది నిరుపేద కుటుంబం కావడంతో వృద్ధులైన తల్లిదండ్రులను భార్యను పోషించేవాడు. చేతికందిన కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులు, భార్య నిరాశ్రయులయ్యారు. ఎవరైనా దాతలు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబానికి మంగళవారం జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు నరేష్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గారాం లింగన్న, దావనపెల్లి రాజశేఖర్, పెట్టేం నరేష్, పొకవెని మల్లేష్, గోపు వినోద్, అప్పని వసంత్, రవి, ఉత్తర్, రామరావు పాల్గొన్నారు.



'బీఆర్ఎస్ మాటల గారడి తప్ప చేసిందేమి లేదు'

● డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కాల్వ, కాల్వ తండా, న్యూలోలం, సిర్గాపూర్ గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మంగళవారం విస్తృత పర్యటన చేశారు. జగదాంబ, సేవాలాల్‌ను దర్శించుకొని గ్రామంలోని ఇంటింటికి కాంగ్రెస్ ప్రకటించిన అభయ హస్తం హామీలను, ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలియజేశారు. కాల్వ తండాలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీవి మాటల గారడీ తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని దోచుకొని తింటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అరవై సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షని నెరవేర్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో గ్రామాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, అరుగుల రమణ, సాగర్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, గోవింద్ రెడ్డి, మహేందర్, లోలం శ్రీహరి, కంజర్ సాయన్న, నరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించాలి

● బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులు

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంతో పాటు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను చూసి గెలిపించాలని మంత్రి, బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో ఇంద్రకరణ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి, తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు...

సారంగాపూర్ మండలం సోనాపూర్ తండా పంచాయతీ పరిధిలో ఉన్న సోనాపూర్ తండా, గోపాల్‌పేట్ తండా, హర్యాయి తండా ప్రజలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో చేరారు. వీరికి ఇంద్రకరణ్ రెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ తెలంగాణలో ఎక్కడ లేదని రెండు మూడు స్థానాలు తప్ప ఎక్కడ గెలిచే అవకాశాలు లేనట్లు ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలకు అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు ఐకేరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్య నారాయణగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆదరించాలి

● ముధోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణ్‌రావు పటేల్, పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-ముధోల్

అభివృద్ధి చేస్తా గెలిపించాలని ముధోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. మంగళవారం ముధోల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నయబాది నుంచి జీఎం పంక్షన్ హల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుతున్నారని అన్నారు. చేతు గుర్తుకు ఓటు వేసి, తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముధోల్‌తో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటు పడుతానని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసిందేమి లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్దే తప్ప నియోజకవర్గంలో నేటికి అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రావు పటేల్, ఎంఎ లతీఫ్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, నాయకులు అంజాద్, శంకర్ చంద్రే, జావిద్ ఖాన్, గోపిడి ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ఖాలీద్ పటేల్, హన్మండ్లు ఉన్నారు.

టీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ) అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాడిహత్నూర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బేత్తల్‌గూడ



గ్రామపంచాయతీలో కళాజాత ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు బ్యాంక్ అందిస్తున్న సేవలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందించే భీమా పథకాలు, క్రాప్ లోన్, డ్వాక్రా మహిళ సంఘాల రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు చెల్లించిన వారికి కొత్త రుణాలు మంజూరు చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత పరమేశ్వర్, ఉపసర్పంచ్ ఇస్రు, ఫిల్డ్ ఆఫీసర్ పి.సునీల్, బ్యాంక్ సిబ్బంది సాబీర్, గాంగులీ, సీఎస్‌సీ నిర్వహకులు రవీందర్ గ్రామ పటేల్ బోజ్జు, బాదిరావ్ ఉన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని గుండాల, గోండుగూడా, చిత్తగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణీలు రక్తం తక్కువ ఉండడంతో పీహెచ్‌సీకి రెఫెర్ చేశారు. చలికాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్‌దాస్, గ్రామ పటేల్ మాన్కు,



నాయకులు శ్రీరాం, వైద్య సిబ్బంది ఈశ్వరీ, నరేందర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సీతాబాయి ఉన్నారు.

ఊరూరా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవా లక్ష్మిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని నాగల్‌కొండ, తాడిహత్నూర్‌తో పాటు ఆయా



గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను వివరిస్తూ బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమని భరోసానిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని సర్పంచ్ బానోత్ గజానంద్ కోరారు. సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మెన్ సురేష్ ఆడే, మాజీ జెడ్పీటీసీ రూపావతి జ్ఞానోబా పుష్కర్, కోఆప్షన్ మెంబర్ దస్తగిరి, ప్యాక్స్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, సీనియర్ నాయకులు నర్సింగ్ మోరే, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.

రేవంత్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం డైట్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. మంగళవారం మావల మండలంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. డైట్ మైదానంలో జరిగే సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండలం నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అట్ల.గోవర్ధన్ రెడ్డి, ఆనంద్ రావ్, సురేష్, భూమేష్, బాల కృష్ణ, అడెల్లు, రాములు పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపున మంగళవారం మండలంలోని సుంకిడి, రుయ్యాడి, భరంపూర్, పల్లి-బి గ్రామాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని, నియోజకవర్గం నుంచి పార్టీ బలపరిచిన అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. పదేళ్ల కాలంలో తాము చేసిన అభివృద్ధియే గెలుపిస్తుందన్నారు. పథకాలపై కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కేదారేశ్వర్ రెడ్డి,



సర్పంచ్ మహేంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ వెంకన్న, అక్తార్, ప్రసోన్ రెడ్డి, అజయ్, ప్రకాష్, ఆశారెడ్డి, నర్సింగ్, భీమన్న, రవి, రమాకాంత్ పాల్గొన్నారు.

ప్రచారానికి నేతలొస్తున్నారు

- గ్రామాల్లో హోరాహోరీగా సాగుతున్న ప్రచారాలు
- నేడు ఉట్నూర్‌కు రేవంత్ రెడ్డి
- త్వరలో బండి, కేసీఆర్, కేటీఆర్ సభలు

నవతెలంగాణ-ఉట్నూర్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీ అగ్రనేతలు వస్తున్నారు. నియోజకవర్గంలో ఆయా పార్టీలు అధికారంలో వచ్చేందుకు అభ్యర్థుల బలోపేతానికి అగ్రనేతలు వచ్చి ప్రచారంలో పాల్గొననున్నారు. ఇది వరకు ఉట్నూర్‌కు వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు వచ్చి శ్రేణుల్లో ఉత్సహం నింపివెళ్లారు. ఆయా పార్టీలోని ఆశవాహులు చేజారకుండా పార్టీ రాష్ట్ర నాయకులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో ప్రచారాలు జోరందుకున్నాయి. మండల కేంద్రానికి పరిమితమయ్యే నాయకులు గ్రామాల బాట పట్టారు. ఎవరికి వారే తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను వెడుకుంటున్నారు. దీంతో రోజురోజుకు ఎన్నికల వేడి తీవ్రమవుతుంది. నియోజకవర్గంలో ఈ సారి కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి హ్యాట్రిక్ సాధించాలని, మంత్రి కేటీఆర్ స్నేహితుడు, ఎన్ఆర్ఐ భూక్యా జాన్సన్ నాయక్‌కు టికెట్ కేటాయించి ప్రచారం మమ్మురం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటివల హరిష్‌రావు, త్వరలో సీఎం కేసీఆర్, పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ సభలు నియోజకవర్గంలో ఉండడం అత్యంత ప్రాధాన్యత సంతారించుకుంది. ప్రచారంలో మేము కూడా తక్కవగా లేమని కాంగ్రెస్, బీజేపీలు బలంగా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బుధవారం ఉట్నూర్‌లో జరిగే సభకు హజరువుతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ స్థలంలో బహిరంగ సభకు మమ్మురంగా ఏర్పాట్లు జరగుతున్నాయి. సభను



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెడ్మా బోజ్జు

విజయవంతం చేయాలని పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు నాయకులకు కోరారు. సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చేల కార్యచరణను రూపోందించామని ఆయన తెలిపారు. ఇది వరకే పార్టీ అదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని నాయకులు సూచించినట్లు పేర్కొన్నారు. ఇదే బాటలో బీజేపీ సైతం తక్కువగా ఎం లేమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బహిరంగ సభను త్వరలో నియోజకవర్గంలో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఖానాపూర్ నియోజకవర్గానికి ముఖ్యనేతలు రావడంతో అత్యంత ప్రధాన్యత నెలకొంది. ఈ సారి ఎలాగైన ఆయా పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని భారీగా ఆశలు పెట్టుకోని దానికి అనుగుణంగా ప్రచారాలు చేస్తున్నారు. ఏది ఎమైనప్పటికి ప్రజలు ఏ నాయకున్ని ఎన్నుకున్నంటారో ఎన్నికల ఫలితాల్లో భవిత్యం తెలనుంది.

వ్యవసాయాన్ని పండగలాగా మార్చాం



నవతెలంగాణ-బేల

తోమ్మిది సంవత్సరాల కాలంలో వ్యవసాయాన్ని పండుగగా మార్చామని, అన్నదాతలకు భరోసా కల్పిస్తూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, బీఆర్ఎస్ మానిఫెస్టోను వివరించారు. మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు తిలకం దిద్ది ఆహ్వానించారు. భజన బృందాల సభ్యులు గీతాలను ఆలపిస్తూ స్వాగతం పలకడం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధుల వ్యయంతో పల్లెలను ప్రగతి పథంలో నడుపుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపుతున్న తమపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రజాక్షేత్రంలో ఆ పార్టీలకు ప్రజలే తగిన గుణపాటం చెప్తారన్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో ఇక్కడ అమలవుతున్న పతకాలు ఎందుకు అమలు కావడం లేదో గమనించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్తు సరిపోతుందన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గుర్తు చేసిన ఎమ్మెల్యే 24 గంటల నిరంతర విద్యుత్తును అందించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలతో వ్యవసాయాన్ని పండగలా చేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మెన్ మనోహర్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, గంభీర్ ఠాక్రే, దేవన్న, సతీష్ పవార్, తేజరావ్ వాడ్కర్, నానాజీ చరడే పాల్గొన్నారు.

ఆదిలాబాదు రూరల్ : మండలంలోని న్యూ రాంపూర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జోగు రామన్న పాల్గొని రోడ్ షో నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టో, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా న్యూ రాంపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, మేడిగూడ వెంకట్ రెడ్డి, యువకులు పార్టీలో చేరారు. పార్టీ కండువలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, సర్పంచ్ కవిత వెంకట్ పాల్గొన్నారు.

ఆదివాసులను అన్యాయం చేసిన కాంగ్రెస్

నవతెలంగాణ-ఉట్నూర్

బోథ్ నియోజకవర్గానికి ఆదివాసి అభ్యర్థి వెన్నెల అశోక్‌ను ముందుగా ప్రకటించి, లంబడా గిరిజనులకు పార్టీ అవకాశం కల్పించిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని నాయకపోడు సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొంత ఆశారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయక్ పోడ్ తెగ అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో సంతోశించామన్నారు. లంబాడ గిరిజనుల ఒత్తిడికి తలోగ్గి అభ్యర్థిని మార్చారని ఆరోపించారు. ఆదివాసి గిరిజనులకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. బోథ్‌లో స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో దించుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కొండెంగ అమృత్, నాయకుడు సిపల్లి ప్రశాంత్ ఉన్నారు.

తాంసి : స్వార్థం రాజకీయాల లబ్ధి కోసమే డాక్టర్ వన్నెల అశోక్‌ను బలిపశువు చేశారని తలమడుగు, బజార్హత్నూర్ జెడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, మల్లెపూల నర్సయ్య ఆరోపించారు. మంగళవారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ వన్నెల అశోక్‌కు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వన్నెల అశోక్ ఐదు సంవత్సరాల నుండి పార్టీకి ఎనలేని సేవలు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత బి



ఫామ్ ఇవ్వకుండా మరో వ్యక్తిని ప్రకటించడం మంచిది కాదన్నారు. ఓడిపోయే వ్యక్తికి టికెట్ ఇస్తున్నారన్నారు. ఒక గిరిజన తెగకు చెందిన వ్యక్తికి టికెట్టు ఇవ్వకపోవడంతో యావత్తు ఆదివాసి గిరిజన కార్యకర్తలను అవమానించినట్టే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సంతోష్, నాయకులు రాజేశ్వర్, వెంకటి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన పలువురు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మండలాధ్యక్షులు రత్నం ప్రదీప్, మండల యూత్ అధ్యక్షులు భారతని సతీష్ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు మాజీ జడ్పీటీసీ కేశవులు, బీఆర్ఎస్ మండల వైస్ ప్రెసిడెంట్ బింగి శ్రీనివాస్, జనార్దన్‌లు కాంగ్రెస్‌లో పార్టీలో చేరగా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, మాజీ సహకార చైర్మన్ పూస్కూరి వంశీ కృష్ణారావు, పుల్ల కుమారస్వామి, ముల్కల రాజు, గుండా రాజు కుమార్, దుర్గం ప్రవీణ్, సల్లూరి సమీల్, మారం సురేష్, జాడి మల్లేష్ పాల్గొన్నారు.

మాలీల ఎస్టీ హోదా అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

నవతెలంగాణ-కెరమెరి

మాలీల ఎస్టీ హోదా అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గూరే బాలాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 22 ఏండ్లుగా ఆంధ్ర రాష్ట్రంలో ఎస్టీలుగా ఉండి, తెలంగాణలో బీసీలుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. గత కొన్నేండ్లుగా తెలంగాణలో మాలీలు ఎస్టీ హోదా కోసం అనేక విధాలుగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వద్ద మాలీల ఎస్టీ హోదా బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించి న్యాయం చేస్తామని అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇస్తూ, తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ ఎన్నికల్లో జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి గద్దల హైమావతి సూచించారు. పార్టీ ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమెకు అభ్యర్థి శ్యామ్‌నాయక్‌తో పాటు పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాటు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పార్టీ విజయం సాధించేలా చూడాలన్నారు. 9 సంవత్సరాలు బీఆర్ఎస్ చేసిన అవినీతిని ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ వైపు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానున్నదని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండీ ఆసిఫ్ అలీ, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండా శ్యామ్, ఎస్సీ సెల్ చైర్మెన్ పస్తం పోశం, మండల అధ్యక్షులు మాసాదే చరణ్, నాయకులు మురళి పాల్గొన్నారు.

ఘనంగా మండలస్థాయి కళోత్సవ్

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం మండలస్థాయి 2023 కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని ఎంఈఓ వాసాల ప్రభాకర్ అధ్యక్షతన అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కళోత్సవంలో పలు అంశాలపై పోటీలు నిర్వహించగా మండల స్థాయిలో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో కళలను వెలికి తీసేందుకు కళోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కూకట్ల రాజేష్, ఉపాధ్యాయురాలు బండ శాంకరి, సీసీఓ రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

● మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం గోపాల్‌పేట్ సర్పంచ్ సల్ల సాయన్న సమక్షంలో సుమారు 200 మంది సొనాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన గోపాల్‌పేట్ తండా, హర్కయి తండా వాసులు, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరోసారి సీఎం కేసీఆర్ అవుతారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి ఎవరు నమ్మరని అన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశంలోనే ఎక్కడ లేవన్నారు. అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసెలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్ నారాయణ రెడ్డి, మాణిక్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ చందు, పార్టీ కన్వీనర్ మాధవరావు, నాయకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

వరి పంట మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో 2023-24 వానాకాలం (ఖరీఫ్) వరిధాన్యం కొనుగోలు, మద్దతు ధర చెల్లింపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని తెలిపారు. గ్రేడ్ 'ఎ' రకానికి రూ.2 వేల 203, సాధారణ రకానికి రూ.2 వేల 183, చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు మద్దతు ధర పొందాలంటే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త, మట్టి, రాళ్లు లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. రైతులు తమ ఫోన్ నంబర్ ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాతో అనుసంధానం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, మొబైల్ నెంబర్ అనుసంధానం కొరకు బ్యాంకులు, ఆధార్ కేంద్రాలు, పోస్టాఫీసులు, మీ-సేవా కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే సమయంలో ఓ.టి.పి. నంబర్ కోసం రైతులు తమ మొబైల్ ఫోన్ను తమ వద్ద ఖచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, ఓ.టి.పి. నంబర్ వచ్చిన తరువాతనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. అనంతరం వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

● జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి బోర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని, ఎన్నికలు సజావుగా సాగేందుకు 2 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు కదం సురేష్, కాసబోయిన సురేష్‌తో కలిసి అసెంబ్లీ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు 2 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని తిర్యాణి మండలంలోని బుగ్గగూడ, భీంజీగూడ, తాటిమాదర హాబిటేషన్లను కలిపి బుగ్గగూడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు, సిర్పూర్ నియోజకవర్గంలో సిర్పూర్ (టి) మండలంలోని ఇటిక్యాలపహాడ్ గ్రామంలో ఆక్సిలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు భారత ఎన్నికల సంఘం అనుమతి కొరకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు మధుకర్, జితేందర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్, ధర్మాజీపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు. అలాగే మన నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. మూడోసారి కూడా మన ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీలచ్చన్న, ధర్మాజీపేట్ సర్పంచ్ ఒర్సు వెంకటేష్, మండల బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, రాజేశ్వర్‌గౌడ్, సత్యం అంబారిపేట్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు బి.రవి, మిల్కూరి సత్తన్న, రెంటం శ్రీను, రేంకల రాజన్న, మోహన్, చంద్రయ్య, ఆనంద్, రమేష్, శ్రీను, వినోద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం నవంబర్, 8 2023

ఆదివాసీ దండారీ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సల్పాలవాగు వెంకటాద్రి దేవాలయం వద్ద 9న నిర్వహించే ఆదివాసీ దండారీ దర్బార్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. మంగళవారం మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షులు ఎస్కే జ్యోషి, జీఎం కులకర్ణి చేతుల మీదుగా పోస్టర్లను విడుదల చేయించారు. ఆదివాసీ దండారీ దర్బార్‌లో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దండారీ దర్బార్ నిర్వాహణ అధ్యక్షుడు ఆడె జంగు, ప్రధాన కార్యదర్శి మడావి అనంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెడ్మ కిషన్, కోశాధికారి రాయిసిడాం రమేశ్, ప్రచార కార్యదర్శి ఆత్రం జంగు, సభ్యులు రాయిసిడాం రాందాస్, రొడ్డ కిష్టయ్య, సోయం సూరు, తిరుపతి, కొడప భీంరావు, రాయిసిడాం శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించే కేసీఆర్ సభను విజయవంతం చేయాలని జడ్పీటీసీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన వార్డుసభ్యులు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని పెర్కవాడకు చెందిన వార్డుసభ్యుడు పెంటయ్యతో పాటు పెర్క సంఘం నాయకులు మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ



నవతెలంగాణ-కౌటాల

ఎస్సీ వర్గీకరణకు ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందమకృష్ణ మాదిగ నాయకత్వంలో విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్టు ఎమార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ పిట్టల సత్యనారాయణ మాదిగ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎస్సీ వాడలో చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు ముఖ్య అతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నక్క శంకర్, సీనియర్ నాయకులు నక్క పెద్ద శంకర్, గుడిసెల అశోక్, పిట్టల నీలయ్య, ఇగురపు వెంకటి, ఇప్ప సునీల్, ఇగురపు వెంకయ్య, పిట్టల తార, పార్వతి పాల్గొన్నారు.

పండగపూట పస్తులేనా..!

- 3 నెలలుగా అందని పెండింగ్ వేతనాలు
- ఇబ్బందుల్లో మిషన్ భగీరథ కార్మిక కుటుంబాలు

నవతెలంగాణ-కెరమెరి

మిషన్ భగీరథలో పని చేసే కార్మికుల 3 నెలలుగా జీతాలు అందక పండగకు పస్తులుండే పరిస్థితి వచ్చింది. తెల్లారక ముందే పల్లె ప్రజల గొంతులు తడవాలన్నా, ఉదయం నుంచి పొద్దు పోయేవరకు వివిధ కార్యకలాపాలకు నీటి అవసరం ఉంటుంది. ప్రతి రోజు సమయపాలన పాటిస్తూ గ్రామాల్లో ప్రజల మేలే పరమావధిగా తమ కర్తవ్యాలను కొనసాగించే మిషన్ భగీరథ కార్మికులు 3 నెలలుగా జీతాలు లేక దీనావస్థలో కుటుంబాలను పోశించుకుంటున్నారు. నిర్విరామంగా తమ సేవలందిస్తున్నా మిషన్ భగీరథ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి వారి బతుకుల్లో చీకటి అలుముకొంది. పండగ పూట పస్తులుండే పరిస్థితులు దాపురించాయి.



కెరమెరి మండలంలో పనులు చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు (ఫైల్)

ఎనిమిదేండ్లు ఆర్థిక ఇబ్బందులు

జిల్లాలోని వివిధ విభాగాల్లో సుమారు 400 మందిపై చిలుకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఎల్ అండ్ టి యాజమాన్యం చెల్లించాల్సి ఉంది. 2015లో విధుల్లో చేరిన నాటి నుండి నేటి వరకు ఏ ఒక్క నెల జీతం సకాలంలో వచ్చిన దాఖలాలు లేవని కార్మికులు ఆరోపిస్తున్నారు. నెలసరి జీతాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవాడాకి నానా పాట్లు పడుతున్నారు. 3 నెలలుగా పెండింగ్ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు వారీ ఖర్చులు, సరుకులు కొందామంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విధుల్లో భాగంగా గ్రామాల్లో నీటి సరఫరా చేయాలన్న కొంత మంది కార్మికులకు వ్యయ ప్రయసాలు తప్పడంలేదు.

పట్టించుకోని అధికారులు

పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి వేడుకున్నా, తమ బాధలు చెప్పినా ఇప్పుడొస్తాయి, అప్పుడొస్తాయంటూ కాలం వెల్లదీస్తున్నారే తప్ప జీతాలు ఇవ్వడంలేదని వాపోతున్నారు. పండగ ఎలా జరుపుకోవాని ఆవేదన చెందుతున్నారు వేతనాల కోసం గతంలో పలు విధాలుగా నిరసన ప్రదర్శనలు చేసిన ప్రతి నెల వేతనాలు ఇచ్చే విషయంలో యాజమాన్యాల వైఖరిలో ఏ మాత్రం మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిందిచ 3 నెలల పెండింగ్ వేతనాలు దీపావళి పండగ లోపు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలయాపన చేస్తున్నారు

మాచర్ల బుద్దన్న, మండల అధ్యక్షుడు కెరమెరి



పెండింగ్ వేతనాలకోసం సంబంధిత అధికారులను సంప్రదిస్తే స్పందించడం లేదు. నాలుగు నెలలు పని చేస్తే ఒక నెల జీతం ఇస్తున్నారు. రేపు, మాపు అంటూ కాలయన చేస్తున్నారే తప్ప పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదు. దీపావళి పండగకు పిల్లలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పని చేసి కూడా అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి పండగలోపు 3నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలి.

సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనప్పను గెలిపించాలి



నవతెలంగాణ-దహెగాం

సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపించాలని కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ఇట్యాల, దేవాజీగూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే కారు గుర్తుకు ఓటు వేసి కోనేరు కోనప్పను ఎమ్మెల్యేగా గెలిపించాలని అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయన్నారు. ఇంటింటికి బీఆర్ఎస్ పథకాలు అందాయని, మరో ఐదు సంవత్సరాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్, మురారీ, నాయికిని లక్ష్మణ్, రాజన్న, రాజారాం, విఘ్నేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజల సంక్షేమం

- ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, అన్ని సామాజిక వర్గాలు అభివృద్ధి చెందాలని ఆయా సామాజిక వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రమే తెలంగాణ రాష్ట్రమని, రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని హుడ్కిళి గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకులు కిరమరె రావూజీ, చందన్‌కడె ప్రవీన్‌తో పాటు పలువురు గ్రామస్తులు కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని, మనమందరం కలిసికట్టుగా పోరాడితే మరోసారి గెలుపు మనదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిజర్ హుస్సేన్, ఈర్త సత్యనారాయణ, తోట మహేష్, తరుణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే యువత పూర్తి మద్దతు

కౌటాల: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న వేల బీఆర్ఎస్‌కు మద్ధతు పెరుగుతోంది. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో మంగళవారం మండలంలోని తలోడి, చింతలమానేపల్లి మండలకేంద్రం, సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల గ్రామ యువకులు ఎమ్మెల్యేను కలిసి రాబోయే ఎన్నికల్లో తమ పూర్తి మద్ధతు తమకు ఉంటుందని, విజయం మీదేనని బరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు వచ్చాయని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు రావాలంటే. తెలంగాణ ప్రభుత్వమే రావాలని తెలిపారు. దాని కోసం ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పకు యువకులందరి పూర్తి మద్ధతునిచ్చి అధిక మెజార్టీతో



గెలిపించుకుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మళ్లీ అవకాశం ఇస్తే మీకు సేవ చేసుకుంటానని ఆయన తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మన నియోజకవర్గంపై ఎంతో ప్రేమతో ఉన్నారని, మన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మీరంతా కారు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి మనమంతా గిఫ్ట్ ఇవ్వాలని ఆయన తెలిపారు. ఎన్నడూ రాని పగటి వేశగాళ్లు ఎన్నికలొచ్చాక వస్తున్నారని, మళ్లీ ఎన్నికలు అయ్యాక ఏ ఒక్కడు ఇక్కడ కనిపించడని ఆయన అన్నారు. గత 30 ఏండ్లుగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్నానని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట చింతలమానెపెల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, కౌటాల మాజీ ఎంపీపీ నికాడే గంగారాం, బీఆర్ఎస్ నాయకులు డుబ్బుల వెంకన్న, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి

రెబ్బెన : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖైర్‌గాం గ్రామంలో గడపగడపకు నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వాటి ద్వారా ప్రతి పేద, బడుగు బలహీన వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు, అనేక సంక్షేమ పథకాలు, మెనిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించి ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ప్యాక్స్ చైర్మెన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మెన్ రంగు మహేష్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
బుధవారం నవంబర్, 8, 2023

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకే కళోత్సవం

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటికి తీయడానికి ఈ కళోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించామని మండల ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని, బాలుర ప్రభుత్వ పాఠశాలలో వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్లాసికల్, జానపద, చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 9, 10 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో కళానైపున్యాన్ని పెంపొందించేందుకే ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు కొండ్ర జనార్ధన్ జాడి మురళి, గొల్ల రాజన్న వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని మంచిర్యాల డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య, మహిళా క్లినిక్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు ఏడు రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు 100 శాతం ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీ అయ్యేవిధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఉమశ్రీ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవకుడిగా వచ్చా ఆదరించండి

నవతెలంగాణ-రెబ్బెన

జిల్లా రవాణా శాఖ అధికారిగా పనిచేసి స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రజాసేవకుడిగా వచ్చానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గోలేటిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు దఫాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలించినప్పటికీ పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రాజకీయ సమాధి తప్పదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులు ఎన్నికల ప్రచారంలో గ్రామానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. రాష్ట్రంలో



సమన్యాయ పాలన రావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఆయన సమక్షంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మద్దెల సురేందర్‌రాజు, కేసరి కిషన్‌గౌడ్, గోలేటి ఎంపీటీసీ లావుడ్య సాగరమ్మ, మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, సంఘం శంకర్, జిల్లెల స్వామి, బత్తిని రాము, దుర్గం రవీందర్, జవ్వాజి అనిల్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం పరిధి మందమర్రి బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్‌తో పాటు మండల కమిటీ శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా జైపూర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కటుకూరి సత్యం ఆధ్వర్యంలో వార్డు సభ్యులు కాంగ్రెస్



పార్టీలో చేరారు. ఉద్యమకారులకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుర్తింపు లేకుండాపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చెన్నూర్‌లో గెలుపొందడానికి తమవంతుగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

కిష్టంపేటలో ఎక్సైజ్ దాడులు



నవతెలంగాణ-తాండూర్

మండలం కిష్టంపేటలో మంగళవారం ఎక్సైజ్ ఎస్సై నిర్మల పటేల్ దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఉప్పుల్ల లలిత ఇందారపు లక్ష్మి ధర్మరాజుల బానమ్మలను తాండూరు తహసీల్దార్ రోహిత్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు నిర్వహిస్తుందని తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారు చేసిన నాటు సార నిల్వలు కలిగి ఉన్న శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి విస్తృత ప్రచారం



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బుక్యా జాన్సన్ నాయక్ మంగళవారం మండలంలోని లింగయ్యపల్లె, చింతలపల్లి, బాదంపల్లి, ఇప్పలపల్లి జన్నారం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మూడవసారి ముఖ్యమంత్రి కేసీఆర్ రాగానే మహిళలకు కేవలం రూ. 400కు గ్యాస్ అందించనున్నామన్నారు. వృద్ధులకు పింఛన్లు రూ.5000 వేలకు పెంచుతామన్నారు. రైతుబంధు రూ.16 వేలకు పెంచి రైతులకు అందిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఎల్ఐసి బీమా, ఆరోగ్య శ్రీ రూ.15 లక్షల ఆరోగ్య బీమా ఇచ్చి పేదలను ఆదుకుంటామన్నారు. అనంతరం జన్నారం పట్టణంలో కిరాణా షాపులలో ప్రచారం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్ధన్, ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

ఆశీర్వాద సభకు భారీగా తరలిన గ్రామీణ ప్రజలు

జైపూర్ : చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని మందమర్రి పట్టణంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు గ్రామీణ ప్రజలు భారీగా తరలించారు. స్థానిక ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, జడ్పీటీసీ మేడి సునిత తిరుపతితో పాటు మండల నాయకుల ఆధ్వర్యంలో జన సమీకరణ చేశారు. మండల పరిధిలో గల 20 గ్రామ పంచాయతీల నుండి సుమారుగా 5 వేల మందిని మందమర్రికి తరలి వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆశీర్వాద సభకు జన సమీకరణ

తాండూర్ : బెల్లంపల్లి నెంబర్ వన్ గ్రౌండ్‌లో బుధవారం జరగబోవు సీఎం ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి బోయపల్లి గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు బోయపల్లి ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం గ్రామ అధ్యక్షుడు రుకుం తిరుపతి మాసాడి నారాయణ భీమా రాజకుమార్, దాడి బాలాజీ, కొమ్ము మల్లేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎలిగేటి స్వామి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రస్తావించాలి

నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 14న ఢిల్లీలో సమావేశం కానున్న జేబీసీసీఐ స్టాండరైజేషన్ కమిటి సభ్యులు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చ జరుపాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. జాతీయ బొగ్గు వేతన ఒప్పందం-11వ ప్రకారం బొగ్గు ఉద్యోగులకు జాతీయ కార్మిక సంఘాల ఐక్య సంఘటన వలన కోలిండియా యాజమాన్యం, సింగరేణి యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో కుదిరిన ఒప్పందం ప్రకారం 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్‌తో కార్మికులకు గణనీయంగా వేతనాల పెరుగుదలతో పాటు వేతన సవరణ బకాయిలు చెల్లించడం జరిగింది. వేతన ఒప్పందంలో అమలు కాని ఎల్ఎల్‌టీసీ సెలవు, ఎంఎంసీ తదితర విషయాలను చర్చించడానికి ఈ నెల 14న ఢిల్లీలో స్టాండరైజేషన్ కమిటి సమావేశం కాబోతుంది. ఈ సమావేశంలో బొగ్గు విశ్రాంత ఉద్యోగులకు దేశ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాలైన వైద్య సేవలు, ఉచితంగా అందించడం, పెన్షన్ పెంపుదల, పెండింగ్‌లో ఉన్న రూ.20 లక్షల గ్రాట్యూటి సీలింగ్ ప్రస్తుతం అమలు వరుస్తున్న 2018 మార్చి 29 ప్రకారం బదులుగా 10వ వేజ్‌బోర్డ్ అమలు తేది 2016 జూలై 1 అమలుపరుస్తూ బకాయిలు చెల్లింపుకు కృషి చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంలో సమావేశంలో పాల్గొంటున్న కార్మిక సంఘాల నాయకులు విశ్రాంత ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, జాతీయ పత్తి పరిశోధన సంస్థ, నాగపూర్, వ్యవసాయ సాంకేతిక ప్రయోగ పరిశోధన సంస్థ(అటారి) సంయుక్తంగా ఈ నెల 9వ తారీకున కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లిలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.కోట శివకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత మిషన్ క్రింద ఉత్తమ పద్ధతుల ద్వారా మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలలో ముఖ్యంగా ప్రత్తి ఉత్పాదకతను పెంచే అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగుపైన ఆధునిక వ్యవసాయ సాంకేతికతపైన రైతు స్థాయిలో అవగాహన పెంపొందించడమే ఈ కిసాన్ మేళా ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ పత్తి పరిశోధనా కేంద్రం, నాగపూర్ సంచాలకులు ప్రసాద్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస సహ పరిశోధనా సంచాలకులు శ్రీనివాస్ హాజరు కానున్నారని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తాంసి

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్న దర్శనాల అశోక్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. పార్టీ తరపున సంతపాన్ని ప్రకటించారు. అనంతరం దర్శనాల అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనారోగ్య కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలన్నారు. కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పుసం సచిన్, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, సురేందర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ ఉన్నారు.



ఎత్మసార్‌కు ప్రత్యేక పూజలు

- ఆదివాసీ గ్రామాల్లో దండారి ఉత్సవాలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాన్కాపూర్, బేత్తల్ గూడతో పాటు ఆయా ఆదివాసీ గ్రామాల్లో మంగళవారం ఆదివాసులు ఎత్మసార్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి పూజ సందర్భంగా పటేల్ ఇంటి ముందు గుస్సాడీలు ధరించే నెమలి ఈకల టోపీ, డప్పులు, రోల్లు, గజ్జల సామగ్రిని ఒక చోటికి పేర్చారు. సంప్రదాయ ప్రకారం నైవేద్యాన్ని సమర్పించి పూజలు చేశారు. పూజల అనంతరం గుస్సాడి వేషధారణ చేపడతారు. దీపావళి పండుగ వరకు దండారి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏత్మసార్ పూజలో మాన్కాపూర్ మెస్రం రూపదేవ్ పటేల్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, మేస్రం మోతిరాం, కోట్నాక్ నానాజీ, చందు, మేస్రం సీతారాం, రూపదేవ్, మేస్రం భీంరావ్ పాల్గొన్నారు.



కార్మికుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సంక్షేమ కేసీఆర్ లక్ష్యమని, మెడికల్ ఇన్వాల్యుడేషన్ ద్వారా వారసత్వ ఉద్యోగాలను ఇచ్చారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పీ 3 గని ఎదుట కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షతన ఫిట్ సెక్రటరీ రెక్కల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్యేతో పాటు టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావ్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే సింగరేణిలో అధిక లాభాల వాటాను కార్మికులు పొందగలుగుతున్నారని అన్నారు. మరోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికుల సంక్షేమం కోసం మరింతగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడవ సారి సీఎం కేసీఆర్ అయితే మరిన్నీ పథకాలను అమలు చేస్తారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పదేళ్ల పాటు పాలన అందించామని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చేప్పే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్మికులు ఐక్యంగా నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకే కేంద్ర ఉపాధ్యక్షుడు దీకొండా అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, సిక్స్ మాన్ కమిటీ సభ్యులు పెట్టెం లక్ష్మణ్, కాశీరావు, ఏరియా కార్యదర్శులు పానుగంటి సత్తయ్య, కనుగంటి చంద్రయ్య, మహిపాల్ రెడ్డి, మైనింగ్ స్టాప్ ఏరియా నాయకులు అన్వేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి

- నేడు జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి
- జన సమీకరణపై అభ్యర్థుల కసరత్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలతో పాటు మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో బుధవారం జరిగే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా ఆసిఫాబాద్‌లోని ప్రేమల గార్డెన్ పక్కన గల మైదానంలో, కాగజ్‌నగర్‌లోని సీఎం మైదానం, మంచిర్యాలలోని బెల్లంపల్లి నియోజవకర్గంలోని స్థలంలో సభను నిర్వహించనున్నారు. బెల్లంపల్లిలో పాత బస్టాండ్ సమీపంలోని తిలక్ స్టేడియం మధ్యాహ్నం 12 గంటలకు, కాగజ్‌నగర్‌లో 2 గంటలకు, ఆసిఫాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారు. కాగా ఆయా నియోజవకర్గాల అభ్యర్థులు కోవ లక్ష్మీ, కొనేరు కొనప్ప, దుర్గం చిన్నయ్యలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహిళాలు, పురుషులు, జర్నలిస్టులు, పార్టీ ముఖ్య నాయకులు వేరేవేరుగా కూర్చునేల బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారి వాహనాల రాకపోకలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు..

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సభకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో రానున్నారు. సభతో పాటు హెలిప్యాడ్, కాన్వాయ్, పార్కింగ్, సభాప్రాంగణం, ప్రధాన రహదారులు తితర ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు ఇతర జిల్లాల నుండి కూడా సిబ్బందిని తీసుకు వస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



కలప దొంగ అన్న నోటితో మహాత్మాని పిలుస్తారా..?

- గిరిజన, ముస్లీంలకు 12 శాతం రిజర్వేషన్లు ఎందుకు పెంచలేదు
- కేసీఆర్ ఎన్నికల సభను బహిష్కరించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కలప దొంగ కోనప్ప అని పిలిచిన నోటితో కోనప్పను మహాత్మా అని ఎలా పిలుస్తారో ప్రజలకు చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2009 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కాగజ్‌నగర్ వచ్చి ఆంధ్ర కుక్కలు, దోపిడి దొంగలు, కట్టె దొంగ వీరప్పన్ కోనప్ప అన్న కేసీఆర్ మళ్ళీ బుధవారం సిర్పూర్‌కు వచ్చి కోనప్పకు ఓటు వేయమని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని లూటీ చేసిన గజదొంగ మరో కలప దొంగను గెలిపించమని చెప్పడానికి వస్తున్నారని ఆరోపించారు. సిర్పూర్ ప్రజలు కేసీఆర్ సభను స్వచ్ఛందంగా బహిష్కరించాలన్నారు. 2014లో కోనప్పను బీఎస్పీ నుంచి గెలిపిస్తే బీఆర్ఎస్‌కు ఎన్ని కోట్లు తీసుకుని అమ్ముడు పోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని, కేసీఆర్ కాంట్రాక్టుల్లో కమీషన్ల కోసమే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టడంతో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎడారిగా మారిందన్నారు. రూ.35 వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును 30 శాతం కమీషన్ల కోసమే మేడిగడ్డకు తరలించి ప్రాజెక్టు అంచాలను రూ.1.15 లక్షల కోట్లకు పెంచారని ఆరోపించారు. సిర్పూర్ నియోజకర్గంలోని రైతాంగానికి సాగునీరు అందించే తుమ్మిడిహట్టి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని, గూడెం, హుడికిలి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.900 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ పూర్తయినా ప్రాజెక్టు నిర్మించడంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని అన్నారు. 20 ఏండ్లు గడిచినా జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చక పోవచడానికి కారణం కోనప్ప కమీషన్లు కారణమన్నారు. 2006లో మొదలుపెట్టిన కొమురంభీం ప్రాజెక్టు సగం ఆయకట్టుకు కూడా సాగునీరు ఇవ్వడం లేదని విమర్శించారు. అడ ప్రాజెక్టు కాలువల నుండి రావాల్సిన నీరు ఎందుకు రావడం లేదో సమాధానం చెప్పాలన్నారు. పీపీ రావు ప్రాజెక్టు పూడికలు తియ్యక పంటలు ఎండుతున్నాయన్నారు. అందవెల్లి పెద్దవాగు బ్రిడ్జ్ అసంపూర్తిగా ఉందన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం లేదు, యూనియన్ పెట్టుకునే పరిస్థితి లేదు, క్యాంటిన్ లేదన్నారు. గిరిజన, ముస్లీం రిజర్వేషన్లు 12 శాతం పెంచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమందన్నారు. పోడు పట్టాల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయో..? ఎంత మందికి పట్టాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. నోటు ఇవ్వండి- ఓటు వెయ్యండి కార్యక్రమం ద్వారా ప్రజలు ఇచ్చిన విరాళాలను మీడియా సమక్షంలో లెక్కించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురే శ్యామ్‌రావు, మోతీరామ్, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం వాసికి డాక్టరేట్ పట్టా

నవతెలంగాణ-జన్నారం

మండలం కామన్ పల్లి గ్రామానికి చెందిన పేరం శ్రీపాల్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం, ప్రభావవంతమైన బోధన అనే అంశంపై ప్రొఫెసర్ సి.మధుమతి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఆడోబ్ సీఈఓ శాంతను నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.



చికెన్ కోట్టుతూ ప్రచారం



నవతెలంగాణ-ఉట్నూర్

ఎన్నిక ప్రచారాల్లో తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తు పార్టీ నాయకులు ఆకట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ డైరెక్టర్ బాధవత్ పూర్ణచందర్ నాయక్ చికెన్ సెంటర్‌లో కోట్టుతూ ఓటర్లను కలిశారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేసి పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ, మండల అధ్యక్షులు కందుకూరి రమేష్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఉన్నారు.

మనకంటూ ప్రత్యేకత ఉండాలి

- ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు చదువులోనైనా, క్రీడల్లో, ఇతర పోటీల్లోనైనా మనకంటూ ప్రత్యేకత ఉండాలని ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. గిరిజన విద్యార్థులు జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ముఖ్య అథితిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయం సాధించి పేరు, ప్రఖ్యాతలు సాదించాలన్నారు. ఆశ్రమల్లో చదువుతున్న విద్యార్థులను క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సాహిస్తున్నమన్నారు. పోటీలలో గెలుపోటములు సహజమని, ఓటమికి గురైన విద్యార్థులు నిరుత్సాహ పడకుండా గెలిచే విదంగా కసరత్తులు చేయాలని సూచించారు. క్రీడాకారులు క్రీడ స్పూర్తితో పాల్గొనాలని సూచించారు. పోటీలలో గెలుపొందిన జట్టును ప్రశంసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏసీఎంఓ జగన్, జిల్లా గిరిజన క్రీడాల అధికారి పార్థసారథి, ఏటీడీఓ క్రాంతి ఉన్నారు.